

'మహానంది' హుండీ ఆదాయం రూ.62.18 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులు, దేవదాయ శాఖ అధికారులు

మహానంది, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానంలోని ఉభయ ఆలయాల హుండీలను గురువారం అధికారులు లెక్కించారు. గడిచిన 61 రోజులకు గాను హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.62,17,845 సమకూరినట్లు ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ నుంచి రూ.61,59,832, అన్నప్రసాదం హుండీ రూ.26,683, గోసంరక్షణ హుండీ నుంచి రూ.31,330 చొప్పున మొత్తం రూ.62,17,845 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అలాగే హుండీలో వివిధ దేశాల కరెన్సీలు లభించాయన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ఏవో మధు, పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వరరాజు, ఇన్‌స్పెక్టర్లు, వెలుగోడు గ్రూప్ దేవాలయాల ఈవో జనార్దన్, అర్చకులు, సిబ్బంది, శివ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో సిద్ధేశ్వరం

రాయలసీమ సాగునీటి సాధన సమితి

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం-అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవం పురస్కరించిన 31వ తేదీ శనివారం 'చలో సిద్ధేశ్వరం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాయలసీమ రైతు సంఘం ఆధ్వర్యంలో సంగమేశ్వరం వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని కోరారు. రాయలసీమ హక్కులుగా ఉన్న కృష్ణాజలాలు శ్రీశైలం దాటి సముద్రం పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాయలసీమకు హక్కులుగా ఉన్నా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు భూములకు నీరందక బీడు భూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ సాగునీటికి అన్ని వనరులు ఉన్నప్పటికీ నిధులు విడుదల చేయకుండా పాలకులు ప్రతిపాదనలతో కాలం గడుపుతున్నారన్నారు. రాయలసీమకు జరుగుతున్న తీవ్ర అన్యాయంపై ముక్తకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు.

చిరస్థాయిగా నిలిచిపోయేలా కడప మహానాడు

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



బనగానపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించిన మహానాడు సభ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా చేశామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కడప మహానాడు సభకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేశారన్నారు. మహానాడు కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరునా మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నంద్యాల, కర్నూలు జిల్లానుంచి భారీగా తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల నుంచి ప్రతి గ్రామం నుంచి వాహనాలు, బస్సుల్లో వచ్చి సభను విజయవంతం చేశారని, వారందరికీ మంత్రి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

అధోగతిలో తుండ్లవాగు



తుండ్లవాగు రిజర్వాయరు

- రిజర్వాయరులో తగ్గిన నీటి మట్టం
- తుప్పుబట్టిన గేట్లు
- బలహీనంగా మారిన గట్టు
- మాటలకే పరిమితమైన రాజకీయ నాయకుల వాగ్దానాలు
- ఆగిన బోటు షికారు.. తిరిగి ప్రారంభమయ్యేనా?

రుద్రవరం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని తుండ్లవాగు రిజర్వాయరు పూర్తిగా దెబ్బతినింది. దివంగత ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెన్నై రాష్ట్రానికి తాగునీటి సరఫరా చేయడానికి చేపట్టిన తెలుగుగంగలో భాగంగా ఈ ప్రాంతానికి సాగునీరు అందించడానికి సుమారు 175 హెక్టార్లలో 0.45 టీఎంసీల సామర్థ్యంతో 1997-98లో తుండ్లవాగు రిజర్వాయరు నిర్మించారు. అనేక కారణాలతో ఈ రిజర్వాయర్ ఇప్పుడు అథోగతికి చేరుకుంది. నీటి సామర్థ్యం పూర్తిగా పడిపోయింది. గట్టు బలహీనంగా తయారైంది.

నల్లమల రిజర్వ్ ఫారెస్టులో, మండలంలోని టి.లింగంపల్లి, నరసాపురం గ్రామాలకు పైవైపు తుండ్లవాగు రిజర్వాయరు ఉంది. ఇటీవల సామర్థ్యం తగ్గిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ జలాశయంలో తగినన్ని నీరు ఉంటే ఈ ప్రాంతం భూగర్భజలం పెరిగి వ్యవసాయ బోరుబావులు కళకళలాడుతాయి. పొలాలకు సాగునీరు సక్రమంగా అందుతుంది. రిజర్వాయరు పూర్తి సామర్థ్యం 0.65కు పెంచితే అన్ని విధాలుగా బాగుంటుంది. రుద్రవరం, తువ్వపల్లె, రెడ్డిపల్లె, రామాపురం, నాగులవరం, టి.లింగందిన్నెన తిప్పారెడ్డిపల్లె, నరసాపురం, ముత్తలూరు, ఆలమూరు, హరినగరం, తాండ, ముకుందాపురం, చిత్తరేణిపల్లె, మిట్టపల్లె, యాదవవాద ఇంకా పలు గ్రామాల్లోని వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం పెరుగుతుంది. అయితే ఈ రిజర్వాయరు పూడికతో నిండిపోయింది. దీన్ని ప్రారంభించిన 42ఏళ్లలో ఒక్కసారి కూడా పూడిక పనులు చేయించలేదు. దీంతో రిజర్వాయరు సామర్థ్యం తగ్గిపోయింది. అడవిలో కురిసిన వర్షం నీరు రిజర్వాయరుకు చేరుతుంది. అందువల్ల అడవిలో ఉన్న మట్టి, చెత్తచెదారం కర్రలు రిజర్వాయరు చేరి పూడికతో నిండిపోయింది.



తుండ్లవాగు రిజర్వాయరు వద్ద కూలిన రక్షణ గోడ



తుప్పుబట్టిన తుండ్లవాగు రిజర్వాయరు గేట్లు

మాటలకే పరిమితమైన రాజకీయ నాయకుల వాగ్దానాలు

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల ముందు రాజకీయ నాయకులు తుండ్లవాగు గురించి ప్రజలకు వాగ్దానం చేయడం పరిపాటిగా మారింది. ఇంత వరకు ఎక్క నాయకుడు కూడా రిజర్వాయరును పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప రిజర్వాయరు స్థితిలో మార్పు రాలేదు.

హరినగరం మంచినీటి పథకానికి అనుసంధానం

తుండ్లవాగు రిజర్వాయరు నుంచి హరినగరం మంచినీటి పథకానికి అనుసంధానం చేశారు. వేసవిలో రిజర్వాయరులో నీటి సామర్థ్యం తగ్గడంతో మంచినీటి పథకానికి నీరందించడం కూడా ఇబ్బందిగా మారింది. హరినగరం మంచినీటి పథకం నుంచి రుద్రవరం మండలం ఆళ్లగడ్డ మండలాల్లోని గ్రామాల ప్రజలకు తాగునీరు అందడం లేదు.

తుప్పుపట్టిన గేట్లు

రిజర్వాయరుకు మొదట్లో ఏర్పాటు చేసిన గేట్లు తుప్పుబట్టాయి. దీని వల్ల నీరు లీక్ అవుతున్నాయి. తూతూమంత్రంగా గేట్లకు మరమ్మతు చేస్తున్నారే తప్ప శాశ్వతంగా మరమ్మతు పనులు చేయలేదు.

ఆగిన బోటు షికారు

నల్లమలలోని ఎత్తయిన కొండలు, పచ్చని చెట్ల మధ్య తుండ్లవాగు రిజర్వాయరు ఉంది. ఇటు రైతులకు సాగునీరు అందించడమే కాకుండా అహోబిలం వెళ్లే టూరిస్టులకు, భక్తులకు బోటు షికారు చేసేవారు. అప్పటి ఎమ్మెల్యే బోటు షికారును ప్రారంభించిన విషయం విదితమే. బోటు షికారు మూన్నాళ్ల ముచ్చటయింది. ఇక బోటు షికారు ఆగి ఏళ్లు గడిచినా తిరిగి ప్రారంభించలేదు. ఈ బోటు షికారు ఏర్పాటు చేస్తే పర్యాటకులు సందర్శించే అవకాశం ఉంది.

బలహీనంగా రిజర్వాయరు గట్టు

రిజర్వాయరు గట్టు బలహీనంగా ఉంది. గేట్ల పక్క నిర్మించిన వాల్ లీకేజీ అవుతున్నది. గట్టు కూడా బలహీనంగా మారింది. రిజర్వాయరులో పూడిక తీసే పనులు చేపడితే గట్టును బలోపేతం చేయాల్సి ఉంది. గట్టు వెంట ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలి.



బలహీనంగా ఉన్న తుండ్లవాగు రిజర్వాయరు గట్టు

భూగర్భజలం పెరుగుతుంది



తుండ్లవాగు రిజర్వాయరులో నీటి సామర్థ్యం పెరిగితే వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం పెరుగుతుంది. రెండు పంటలు పుష్కలంగా పండుతాయి. వేసవి కాలం వచ్చినా వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం తగ్గకుండా ఉంటుంది. రైతులు ధైర్యంగా పంటలు సాగు చేసుకొనే అవకాశం కలుగుతుంది. రిజర్వాయరులో నీటి సామర్థ్యం పెరిగేలా చర్యలు తీసుకోవాలి.

-సుబ్బారావు, చిత్తరేణిపల్లె

రిజర్వాయరులో పూడిక తొలగించాలి



తుండ్లవాగు రిజర్వాయరులో పూడిక తొలగిస్తే నీటి సామర్థ్యం పెరుగుతుంది. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవి కాలం వస్తే వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలం తగ్గిపోతున్నది. పంటలు ఎండిపోతున్నాయి.

-నరసింహులు

నివేదికలు పంపించాం



తుండ్లవాగు రిజర్వాయరులో నీటి సామర్థ్యం, మరమ్మతులు చేయించేందుకు రూ.46.72 కోట్లతో రెండోసారి నివేదిక పంపించాం. ప్రస్తుతం నీటి మట్టం 0.45 ఉండగా, 0.65కు నీటి సామర్థ్యం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రిజర్వాయరు గట్లు బలోపేతం చేస్తాం.

-శివశంకర్‌రెడ్డి, ఈఈ, తెలుగుగంగ



బయోగ్యం కానివి..!

- నకిలీ బయో ఉత్పత్తులతో నష్టపోతున్న అన్నదాతలు
- రెండు సీజన్లలో అమ్మకాలు రూ.100 కోట్ల పైనే
- కర్నూలు సమీప ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు
- ఫర్టిలైజర్ షాపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు

ఆరుగాలం కష్టపడే అన్నదాతకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు కాగా మరో వైపు నకిలీ విత్తనాలు, మందులు తదితర వాటితో సైతం నిత్యం నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా ఒకప్పుడు నకిలీ బయో ఉత్పత్తుల తయారీకి, అమ్మకాలకు అడ్డాగా ఉండేది. అప్పట్లో ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపడంతో నకిలీ బయో ఉత్పత్తుల తయారీ అయితే తగ్గింది. కానీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నేటికీ జిల్లాలో స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసి నకిలీ మాఫియా రెచ్చిపోతున్నారు. వ్యవసాయాధికారులకు మామూళ్లు ఇస్తూ ఈ వ్యవహారం కొనసాగిస్తున్నారు. అలాగే డీలర్లకు అత్యధిక కమీషన్ల ఆశ చూపుతూ అమ్మకాలు చేపడుతున్నారు. ఇప్పటికీ ఏటా రూ.100 కోట్ల నకిలీ బయో ఉత్పత్తుల వ్యాపారం కొనసాగుతుండటం గమనార్హం.

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ బయో ఉత్పత్తులతో అన్నదాతలు నిలువునా మునుగుతున్నారు. వ్యాపారులు, తయారీదారులు మాత్రం రెచ్చిపోతు న్నారు. ఒకప్పుడు నకిలీ బయో ఉత్పత్తుల తయారీకి, అమ్మకాలకు ఉమ్మడి కర్నూలు జిల్లా అడ్డాగా ఉండేది. ముడి సరుకులను పక్క దేశాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని మారుమూల గ్రామాల్లో బిల్డింగ్‌లు, గోదాములను అద్దెకు తీసుకుని బయో ఉత్పత్తులను తయారుచేసేవారు. వాటిని రైతులకు అంటగట్టేందుకు ఏకంగా కొనుగోలు కేంద్రాలు, స్టాక్ పాయింట్లను కూడా నిర్వహించేవారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నకిలీ బయోఉత్పత్తుల వ్యాపారం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వంద కోట్లకు పైగానే నిర్వహిస్తున్నారు. రసాయనాలు లేని బయో ఉత్పత్తులను రైతులకు అమ్ముకు నేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బయో ఉత్పత్తులకు గుట్టుగా కెమికల్స్‌ను కలిపి తయారీదారులు పెద్దఎత్తున రైతులకు వీటిని అంటగడుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయకుండానే..



ఈ చిత్రంలో కనిపిస్తున్న అంగడి బయట పురుగు మందులు, బయో ఉత్పత్తులు ఎంత పరిమాణంలో ఉన్నాయో వాటి ధరలు ఎంతో తెలిపే బోర్డు ఏర్పాటు చేయలేదు. ఈ దుకాణాలను పర్యవేక్షిస్తున్న కల్లూరు ఏవో శ్రీనివాసరెడ్డి మాత్రం ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా బోర్డులు ఏర్పాటు చేయాల్సిందేనని, తప్పనిసరిగా ఆ బోర్డుపై మందులు ఎంత పరిమాణంలో ఉన్నాయో, ఏ ధరకు అమ్ముతున్నారో నమోదు చేయాలని నోటీసులు కూడా డీలర్లకు అందజేసినట్లు స్పష్టం చేస్తున్నారు. కొత్తబస్టాండులో దాదాపు 20 అంగళ్లు ఉన్నాయి. ఎక్కడా క్రిమిసంహారక మందులు, బయో ఉత్పత్తులు ఏ కంపెనీలకు చెందినవి తమవద్ద ఉన్నదీ బోర్డు ఏర్పాటు చేయకపోవడం దారుణం. వ్యవసాయాధికారులు తమను ఏమీ చేయలేరనే ధైర్యంతోనే డీలర్లు బోర్డులు ఏర్పాటు చేయకుండా నానా రకాల నకిలీ బయో ఉత్పత్తులు అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రైతులు మొగ్గు చూపుతుండటంపై...

జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్ సీజన్‌తో పాటు ఆతర్వాత రానున్న రబీ సీజన్‌లో చౌకగా బయో ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటి అమ్మకాలు వ్యాపారులకు, తయారీదారులకు కనకవర్షం కురిపిస్తున్నాయి. అమాయక రైతులు డీలర్లు, వ్యాపారుల మాటలు నమ్మి నకిలీ బయో ఉత్పత్తులను కొని వాటిని పంటలపై వినియోగిస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టినా ఈ బయో మందులు పనిచేయక కళ్ల ముందే పంట ఎండిపోతుంటే.. రైతులు మరో దారి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అనేకం.

ఉన్నతాధికారుల మాటలు..

అప్పటి వ్యవసాయ శాఖ కమిషనర్ మధుసూదన్ రావు నకిలీ బయో ఉత్పత్తుల తయారీదారులపై ఉక్కుపాదం మోపారు. కర్నూలు జిల్లాలో నకిలీ బయో ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయని అప్పట్లో వ్యవసాయాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తయారీదారులు, డీలర్ల నుంచి భారీగా మామూళ్లు అందుతుండటంతో ఈ మాటలను వారు పెడచెవిన పెడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

నిధుల దుర్వినియోగంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తాం

విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగరాజగౌడ్

డోన్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర నిధులను దుర్వినియోగం చేస్తున్న ఎంపీపీలు, ఎంపీడీవోలు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లపై రాష్ట్ర లోకా యుక్త కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజగౌడ్ అన్నారు. గురువారం స్థానిక ముక్తేశ్వరాలయంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజ గౌడ్ మాట్లాడుతూ వినియోగదారులను వ్యాపారులు నిలువునా దోపిడీ చేస్తూ కొన్ని వస్తువులకు బిల్లులు ఇవ్వకుండా ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతున్నారన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు నంద్యాల జిల్లాకు కేటాయించాయని, ఆ నిధులను కొందరు ప్రజాప్రతినిధులు దుర్విని యోగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డోన్ తాలుకా వినియోగదారుల రక్షణ సంఘం మహిళా కన్వీనర్ వనం లక్ష్మీదేవి, జయ మనోజ్, రవి కుమార్, చిన్న మద్దయ్య, ఓం నారాయణ, ధర్మవరం విజయుడు పాల్గొన్నారు.

స్థిరంగా పత్తి ధరలు

ఆదోని అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,919 పలికింది. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమ వుతున్న సమయంలో పత్తి ధరలు పెరుగుతాయని రైతులు ఆశించారు. అయినా ధరలు పెరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా 147 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.6,002, గరిష్ఠంగా రూ.7,919, మధ్యస్థంగా ధర రూ.7,620 పలికింది.

పైసలు.. పైరవీలు..!
- యార్డులో పోస్టులకు డిమాండ్
- సెక్రెటరీ పోస్టుకు రూ.లక్షల్లో ముడుపులు?

7

హామీల అమలులో బీజేపీ విఫలం
సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు


'మహాసైకిల్


సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు





మహా జాతర



కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం







జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

కర్నూలు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్తర్వుల్లో తెలియజేశారు. ప్రస్తుతం మే31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో మోహన్‌తేజకు గోల్డ్ మెడల్

అభినందించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల, మే 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఓపెన్ బాక్సింగ్ పోటీల్లో కోవెలకుంట్లకి చెందిన మోహన్‌తేజ గోల్డ్ మెడల్ సాధించారు. గోవాలోని కాలింగోట్‌లో జరిగిన జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఏపీకి చెందిన బాక్సింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మోహన్‌తేజ బంగారు పతకం సాధించినట్లు కోచ్ ఫయాజ్ గురువారం తెలిపారు. బెస్ట్‌ఫైటర్ అవార్డుతో పాటు టీం చాంపియన్ షిప్ మోహన్‌తేజ కైవసం చేసుకున్నారన్నారు. జాతీయస్థాయి పోటీల్లో అద్భుతప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించిన చెందిన మోహన్‌తేజను రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అభినందించారు. అతడు భవిష్యత్‌లో మరింత కష్టపడి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.



బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న కోవెలకుంట్ల వాసి మోహన్‌తేజ

బయోగ్యం కానివి..!

(5వ పేజీ తరువాయి)



గతంలో దిన్నెదేవరపాడులో హైవే పక్కనే ఉన్న గోదాములో హైదరాబాదుకు చెందిన వ్యక్తులు అద్దెకు తీసుకుని చైనా నుంచి ముడి సరుకులు తెప్పించి బాసిల్ అనే ప్రముఖ సంస్థ పేరుతో నకిలీ బయో ఉత్పత్తులు తయారుచేస్తుండగా విజిలెన్స్ అధి కారులు దాడులుచేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 కోట్లుపైనే ఉంటుందని అప్పట్లో అంచనా వేశారు. కర్నూలు బాలాజీనగర్ కేశవరెడ్డి స్కూల్ సమీపం లోని గోదాముల్లో రూ.25 లక్షలు విలువ చేసే బయో మందులను (ఓసో కంపెనీ పేరుతో ఉన్న) క్రాంతి ట్రాన్స్‌పోర్టు ద్వారా తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమాచారం తెలుసుకుని వ్యవసాయాధికారులు స్వాధీనం చేసుకున్నారు. పందిపాడు వద్ద ఒక పాతబిల్డింగులో ఉన్న రూ.10 లక్షలు విలువచేసే నకిలీ ఉత్పత్తులను స్వాధీ నం చేసుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కల్లూరు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్నూలు నగర శివారులోని బళ్లారిచౌరస్తా, ఉల్చాల, పందిపాడు తదితర గ్రా మాల్లో నకిలీ బయోఉత్పత్తులను గోదాముల్లో నిల్వచేసి స్థానిక పురుగుమందుల అంగళ్లకు చేరవేస్తున్నట్లు సమాచారం.

కొరవడిన నిఘా

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నకిలీ బయోఉత్పత్తులు డీలర్లు రైతులకు అంటగడు తున్నారు. వీటితో రైతులు నష్టపోతూనే ఉన్నా వ్యవసాయ యంత్రాంగం మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఎక్కడైనా ఈ నకిలీ బయో ఉత్పత్తులు పట్టుబడితే జిల్లా అధికారులు కింది స్థాయి సిబ్బందికి మెమోలు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. వీటి నకిలీ బయో ఉత్పత్తులను గతంలో కొంత మంది రైతులకు అమ్మేందు కోసం కర్నూలుతో పాటు పక్కనే ఉన్న అలంపూర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఏకంగా స్టాక్ పాయింట్లను కూడా ఏర్పాటుచేసుకుని ఏకంగా కొనుగోలు కేంద్రాలను తెరిచారు. వివిధ రాష్ట్రాల్లో, కోస్తా జిల్లాలో, హైదరాబాదు పరిసరాల్లో ఈ నాసిరకం బయో ఉత్పత్తులను తయారుచేసి వాటిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డీలర్లకు చేరవేసి పెద్దఎత్తున రైతులకు అంటగట్టేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు. రూ.100లు విలువ చేసే బయో బాటిల్‌ను డీలర్లతో రైతులకు రూ.50కే అమ్మించి మిగిలిన రూ.50ను వారికి కమిషన్‌గా ఇస్తూ తమ ఉత్పత్తులను భారీగా అమ్ముకుంటున్నారు.

విజిలెన్స్ అధికారులు స్పందిస్తేనే...

విజిలెన్స్ విభాగం అధికారులు కూడా నకిలీ బయో ఉత్పత్తుల స్వాధీనానికి పెద్దగా ప్రయత్నాలు చేయడం లేదనే ఫిర్యాదులు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఏటా రైతులు ఈ నకిలీ బయో ఉత్పత్తులపై ఆధారపడుతూ పంటలను నష్టపోతున్నారు. ఇప్పటికైనా నకిలీ బయో ఉత్పత్తుల స్వాధీనానికి విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి తయారీదారులతో పాటు వీటి అమ్మకా లు చేపట్టిన డీలర్ల భరతం పట్టాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

ఉక్కుపాదం మోపుతాం



ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండటంతో నకిలి బయో ఉత్పత్తుల తయారీతో పాటు వీటి అమ్మకాలను చేపడుతున్న డీలర్లపై ఉక్కుపాదం మోపేం దుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి అకస్మిక తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా ఈ నకిలీ బయో ఉత్పత్తులు పట్టుబడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. డీలర్ల లైసెన్సులు కూడా రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

- వరలక్ష్మి, జేడీ వ్యవసాయ శాఖ

స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఎమ్మిగనూరు


ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం

ఎమ్మిగనూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉత్తమ మున్సిపాలిటీగా పేరొందిన ఎమ్మిగనూరుకు ఎట్టకేలకు ప్రమోషన్ లభించింది. గ్రేడ్-1 ఉంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ స్థాయికి చేరుకుంది. ఈమేరకు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా స్థాయిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మిగనూరు 1937నుంచి 1956వరకు గ్రామపంచాయతీగా కొనసాగింది. 1956నుంచి 1964వరకు మేజర్ గ్రామ పంచాయతీగా ఉంది. అనంతరం 1965 ఏప్రిల్ 1న ఎమ్మి గనూరు పట్టణాన్ని 19 వార్డులతో ఏర్పాటు చేసి మూడో శ్రేణి మున్సిపాలిటీ గా మార్చారు. దాదాపు 20 ఏళ్ల తరువాత 1984లో అప్పటి మంత్రి బీవీ మోహన్ రెడ్డి కృషి ఫలితంగా గ్రేడ్-2 మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 32 వార్డులుగా ఏర్పాటైంది. మరో పదేళ్లకు 1996లో గ్రేడ్-1 మున్సిపాలిటీగా స్థాయిపెరిగింది. తర్వాత స్పెషల్ గ్రేడ్‌గా గుర్తించాలని ప్రజాప్రతినిధులు ప్రయత్నించారు. అయితే అందుకు తగ్గ అర్హత ఎమ్మిగనూరుకు లేదని కొందరు కోర్టుకు వెళ్లడంతో స్పెషల్ గ్రేడ్ హోదాకు బ్రేక్ పడింది. ఈ తరుణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషితో 29 ఏళ్ల తరువాత ఎమ్మిగనూరుకు స్పెషల్ గ్రేడ్ హోదా దక్కినట్లయింది. ఎమ్మిగనూరు మున్సిపాలిటీ స్థాయి పెరగటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లోని స్మార్ట్ సిటీ, అమృత్ పథకాల్లో చోటు దక్కుతుంది. దీంతో పట్టణానికి అమృత్ పథకం కింద తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లతో పాటు వివిధరకాల సౌకర్యాలకు విరివిగా నిధులు మంజూరవుతాయి. అంతేగాక స్మార్ట్ సిటీ కింద పట్టణాన్ని మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ప్రతి ఏటా కేంద్రం విడుదల చేసే ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు దాదాపు 50 శాతం పెరగనున్నాయి. వీటితో పాటు మున్సిపాలిటీలో సిబ్బంది సంఖ్య కూడా పెరుగుతుంది. ప్రధానంగా అసిస్టెంట్ కమిషనర్, ఈఈ, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌తో పాటు మరో డీఈ పోస్టు కూడా రానున్నాయి.

మల్లన్నకు స్వర్ణ కానుకలు


ఆలయ అధికారులకు బంగారు విభూతి రేఖలు, ముక్కెరను అందజేస్తున్న దాత నారాయణమూర్తి

నంద్యాల కల్చరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం దేవస్థానానికి తిరుపతికి చెందిన భక్తుడు కేఆర్ నారాయణమూర్తి 4.2 తులాలతో చేయించిన బంగారు విభూతి రేఖలు, భ్రమరాంబదేవి అమ్మవారికి ముక్కెరను సమ ర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు సమర్పించిన బంగారు విభూతిరేఖలను శ్రీశైలం మల్లికార్జున స్వామికి, బంగారు ముక్కెరకు పూజలుచేసి భ్రమరాంబదేవి అమ్మవారికి అలంకారంగా ఉపయోగిస్తామ న్నారు. వీటిని దాతలు ఆలయ పర్యవేక్షకులు రవికుమార్, జూనియర్ అసిస్టెంట్ సా విత్రి, సహాయ ప్రజా సంబంధాల అధికారి శివారెడ్డికి అందజేశారు. అనంతరం దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.


ఈ నెల 17వ తేదీన నీరు లేక ఇసుక తిన్నెలు, రాళ్లు కనిపిస్తున్న ఆర్డీఎస్ ఆనకట్ట


ప్రస్తుతం తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టపై వరద ఉధృతి

రెండు వారాల్లో...

- ఆర్డీఎస్ ఆనకట్టకు పెరిగిన వరద
- తుంగభద్రకు పోటెత్తిన వరద నీరు

కోసిగి, మే 29 (ఆంధ్రజ్యోతి): రెండు వారాల క్రితం చుక్క నీరు లేక ఎండిపోయిన ఆర్డీఎస్ ఆనకట్ట ప్రస్తుతం వరద ప్రవాహంతో కళకళలాడుతోంది. ఈ నెల 17 వరకు తుంగభద్ర నదిలో చుక్క నీరు లేక ఇసుక తిన్నెలు, రాళ్ల రప్పలతో ఆర్డీఎస్ ఆనకట్ట కళతప్పి వెలవెలబోయింది. పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువ ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రంలోనూ కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్డీఎస్ ఆనకట్ట నిండుకుండలా దర్శనమిస్తోంది. ప్రతి ఏడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలో ఆర్డీఎస్ ఆనకట్టపై నుంచి వరద ఉప్పొంగేది. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేసినప్పుడు మాత్రమే ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి నీరు దిగువకు ప్రవహిస్తుండేది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు పడటంతో కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తింది. దీంతో నదీతీర గ్రామాల ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

మహానాడు విజయోత్సాహం


జిల్లా ఇన్‌చార్జి మంత్రితో తిక్కారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, ఎన్. రాఘవేంద్రరెడ్డి

• బహిరంగ సభకు భారీగా తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

కర్నూలు, మే 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల మూడు రోజుల పండుగ గురువారం ఘనంగా ముగిసింది. కడప గడ్డపై జరిగిన మహానాడు భారీ బహిరంగ సభకు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి వేల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. సభ ముగియగానే తమకే కేటాయించిన బస్సుల్లో స్వగ్రామాలకు బయలుదేరారు. మహానాడు నిర్వహణ వివిధ బాధ్యతలు చేపట్టి సక్సెస్ చేసిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి తదితరులను సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ అభినందించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, కేఈ శ్యాం బాబు, గౌరు చరితారెడ్డి, కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, ఆదోని, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, వీరభద్రగౌడ్, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సహా నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు, నాయకులు తరలివెళ్లారు.


డోంట్ వర్రీ.. మీనాక్షినాయుడితో చంద్రబాబు


హ్యాపీ సార్.. సీఎంతో వీరభద్రగౌడ్


కార్యకర్తలకు వీడ్కోలు.. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రతో బీటీ నాయుడు


హౌ ఆర్ యూ.. తుగ్గలి నాగేంద్రతో లోకేష్


శ్రద్ధగా వినాలి.. మంత్రి టీజీ భరత్


మహానాడులో మంత్రులు: సభావేదికపై మంత్రులు బీసీ, ఫరూక్

పైసలు.. పైరవీలు..!

• యార్డులో పోస్టులకు డిమాండ్

• సెక్రెటరీ పోస్టుకు రూ.లక్షల్లో ముడుపులు?


నంద్యాల మార్కెట్ యార్డు

నంద్యాల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు పోస్టింగ్‌ల కోసం పైరవీలు మొదలెట్టారు. ఒక్కో పోస్టు రూ. లక్షల్లో పలుకుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ప్రజాప్రతినిధులు సైతం పైనల్‌స్తే.. పోస్టింగ్‌కు సిఫారసు చేస్తామని అన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండు రోజులు విజయవాడలో జరిగిన కౌన్సిలింగ్‌కు నాయకుల సిఫార్సులతో అధికారులు హాజరైనట్లు సమాచారం. కానీ ఇప్పటి వరకు వారికి ఉత్తర్వులు అందలేదు. ఉమ్మడి జిల్లాలోని ఆదోని, నంద్యాల, కర్నూలు మార్కెట్‌యార్డుల సెక్రటరీ పోస్టులు ఎవరికి దక్కుతాయనే విషయంలో ఆ శాఖ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు- 07, నంద్యాల -08 చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో 15 మార్కెట్ యార్డులు ఉన్నాయి. అయితే ఇందులో ఆదోని, కర్నూలు, నంద్యాల మార్కెట్ యార్డులకు మాత్రం డిమాండ్ ఉంది. అయితే ఆదోని సెక్రటరీ ఇటీవల రిటైర్ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ పోస్టు రాష్ట్రంలోనే ప్రధానమైన వాటిలో ఒకటి. ఇలాంటి పోస్టుకు ముగ్గురు అధికారులు పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఆ తర్వాత కీలకమైనది కర్నూలు మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టు. ఇక్కడ అనంతపురం మార్కెట్ యార్డు అధికారి ప్రస్తుతం ఇన్‌చార్జి సెక్రటరీగా (ఓడీలో) పనిచేస్తున్నారు. ఇక్కడి రెగ్యులర్ అధికారి అనంతపురం యార్డులో ఇన్‌చార్జిగా (ఓడీ) రూపంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు ఇన్‌చార్జి హోదాలో పనిచేస్తున్న సదరు సెక్రటరీనే రెగ్యులర్‌గా తెచ్చుకోవాలని ముమ్మర ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే రెగ్యులర్ స్థానం కలిగిన అధికారి(అనంతపురంలో పనిచేసే) సైతం ఈ బదిలీల్లో యథాస్థానానికి రావాలని యాచిస్తున్నట్లు తెలిసింది. సాధ్యపడకపోతే.. నంద్యాలకు లేదా. ఆదోనికి పోస్టింగ్‌కు ఇవ్వాలని ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో సదరు అధికారి మొర పెట్టుకున్నట్లు సమాచారం.

కౌన్సెలింగ్ జరిగినా..

వాస్తవంగా ఈనెల ఆఖరికి బదిలీ ప్రక్రియ కొలిక్కి రానుంది. అయితే.. మార్కెటింగ్ శాఖ అధికారులు ఈనెల 22వరకు ఆప్షన్ ఇచ్చారు. ఆ తర్వాత 26, 27వ తేదిలో విజయవాడలో డైరెక్టర్ విజయసునీత కౌన్సెలింగ్ పూర్తి చేశారు. అయితే.. ఈ ఉమ్మడి జిల్లాలోని ఈ మూడు సెక్రటరీ పోస్టుల ఎంపికపై ఆ శాఖ మంత్రి సంతకం కూడా ఉండాలి. సదరు మంత్రి మహానా డులో ఉండటంతో ఉత్తర్వులు జాబితా జాప్యమవుతోంది. ఎవర్ని ఎక్కడికి బదిలీ చేశారో..? ఎవరికి ఎక్కడ పోస్టింగ్ ఇచ్చారో...? ఎవరి ప్రయత్నం ఫలించిందో...? ఇప్పటికీ తెలియకపోవడంతో పరిస్థితి ఉత్కంఠ భరితంగా ఉంది. ఈ పోస్టుల ఎంపికపై మరో రెండు రోజుల్లో స్పష్టత రావచ్చు.

ఆ రెండు పోస్టులకు రూ.లక్షల్లో..?



అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఆదోని మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టుపై ముగ్గురు అధికారులు కన్నేశారని తెలిసింది. ఈ పోస్టు పొందాలంటే సుమారు రూ. 7 లక్షల నుంచి రూ. 10లక్షలు వెచ్చించాల్సి వస్తోందని తెలిసింది. ఆయినప్పటికీ ముగ్గురు అధికారులు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. ఉమ్మడి జిల్లాలోని ఓ సెక్రటరీ, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు సెక్రటరీలు తీవ్ర స్థాయిలో పోటీ చేసినట్లు తెలిసింది. కర్నూలు జిల్లాకు పడమర దిశలో పనిచేస్తున్న సెక్రటరీ కూడా అడిగినట్లు సమాచారం. ఇదే తరహాలో కర్నూలు మార్కెట్‌యార్డు సెక్రటరీ పోస్టు కూడా రూ. 5 నుంచి రూ.7లక్షలు వెచ్చించాల్సి వస్తోందని ఆ శాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అక్కడే ఇన్‌చార్జిగా పనిచేస్తున్న అధికారి రెగ్యులర్ కావడం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కాకపోతే.. ఇక్కడి రెగ్యులర్‌గా ఉండి.. గతంలో భంగపాటుకు గురైన అనంతపురంలో ఇన్‌చార్జి సెక్రటరీగా పనిచేస్తున్న అధికారి తనను రెగ్యులర్ స్థానమైన కర్నూలులోనే ఉంచాలని కోరినట్లు సమాచారం. లేకపోతే.. నంద్యాల, ఆదోని పోస్టుల్లో ఎక్కడైనా కేటాయించాలని కౌన్సిలింగ్‌లో కోరినట్లు తెలిసింది. ఇదే తరహాలో ఉమ్మడి జిల్లాలో పనిచేసే మరో సెక్రటరీ కూడా కర్నూలుకు ట్రై చేస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో నంద్యాలకు విజయవాడ పరిసర ప్రాంతాల్లో పనిచేసే మరో సెక్రటరీ(ఇద్దరిలో ఒకరు) అటు ఫలించకపోతే..కనీసం నంద్యాలకు అవకాశం కల్పించాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అనుకున్న విధంగా జరగకపోతే.. ఆదోని తప్ప.. మిగిలిన ఇద్దరు సెక్రటరీలు యథాస్థానంలో ఉండాలని కూడా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తాము కోరుకున్న చోటికైతే వెళ్తాం.. లేకుంటే ఇక్కడే ఉండిపోతాం అన్నట్టుంది ఇద్దరు సెక్రటరీల పరిస్థితి.

సమష్టి కృషితోనే సహకార బ్యాంకు ముందంజ : జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు అగ్రికల్చర్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన అన్ని ప్రయోజనాలు అందించడంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముందంజలో ఉందని, దీని కోసం బ్యాంకు అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పరస్పర సహకారంతో కృషి చేశారని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య తెలిపారు. గురువారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్న రామాంజనేయులు బాధ్యతలు తీసుకున్నారు. అదే విధంగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించిన విజయకుమార్ తన మాతృ సంస్థ ఆప్కాబ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్‌కు సన్మాన కార్యక్రమం బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేసీ నవ్య మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధి పథంలో కొనసాగేలా పని చేసేందుకు అధికారులు, సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంట రుణాలను దీర్ఘకాలిక రుణాలను వేగవంతంగా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీఎం శివలీల, నాగిరెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా టీడీపీ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ జీవో.నెం. 350ని గురువారం విడుదల చేశారు. ఈఉత్తర్వులు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు అందాయి.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

పెద్దకడబూరు, మే 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మండల పరిధిలోని బసల దొడ్డి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మల్లికార్జున, జ్యోతి దంపతుల కుమార్తె వేదవతి(6) ఆడుకుంటూ ఇంటి వెనకాల ఉన్న అర్త్ వైర్‌ను ముట్టుకుంది. అర్త్ వైర్‌కు కరెంట్ సరఫరా ఉండడంతో షాక్‌కు గురైంది. అక్కడే బట్టలు ఉతుకుతున్న తల్లి జ్యోతి గమనించి ప్రాణాలకు తెగించి చిన్నారిని పక్కకు లాగింది. అపస్మారక స్థితిలో ఉన్న వేదవతిని ఆదోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి తాత బసలదొడ్డి ఈరన్న టీడీపీ కన్వీనర్. కుటుంబసభ్యులు సమాచారం అందించడంతో కడపలో జరుగుతున్న మహానాడు నుంచి ఆయన స్వగ్రామానికి చేరుకున్నాడు. చిన్నారి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.


వేదవతి(ఫైల్)

హత్యాయత్నం కేసులో జైలుశిక్ష

అవుకు, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన కట్టెల వెంకటేశ్వర్లుకు ఓ హత్యాయత్నం కేసులో 3 సంవత్సరాలు జైలు శిక్షను జిల్లా కోర్టు విధించినట్లు ఎస్ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవుకు పట్టణం మార్కెట్ వీధికి చెందిన కంచర్ల లక్ష్మీదేవిపై ఒక వివాదంలో వెంకటేశ్వర్లు మచ్చుకత్తిలో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో నేరం రుజువు కావడంతో 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధించటంతో నిందితుడిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



డోన్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం.నెం.4, 5 గుంతకల్లు వైపు ఉన్న ఫుట్ వే బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తి బ్లూకలర్ ఫుల్ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, 5.4 అడుగులు, చామనఛాయ రంగులో ఉన్నాడని అన్నారు. వయసు 45 ఏళ్లు ఉండవచ్చని. వివరాలు తెలిసిన వారు 9030481295 నెంబరును సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఖాజిపేటలో చోరీ

• నాలుగున్నర తులాల బంగారు, రూ.40 వేలు అపహరించిన దొంగలు

మిడుతూరు, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగలక్ష్మమ్మ ఇంట్లో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. వివరాలివీ.. ఖాజీపేట గ్రామానికి చెందిన పాణ్యం నాగలక్ష్మమ్మ కుమారుడు సుదర్శన్ రెడ్డి నందికొట్కూరు పట్టణంలో ఆటో మొబైల్ వ్యాపారం చేస్తున్నారు. నాగలక్ష్మమ్మ ఖాజీపేట గ్రామం నుంచి నందికొట్కూరుకు కుమారుడి దగ్గరకు ఈనెల 27వ తేది సాయంత్రం వెళ్లారు. 29వ తేది ఉదయం నాగలక్ష్మమ్మకు రోజు పొలం పనికి వచ్చే ఖజీపేటకు చెందిన అమీర్ అనేవ్యక్తి ఫోను ద్వార మీ ఇంటికి ఉన్న తాళం పగలగొట్టారని ఆమెకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె తన కుమారుడినితో ఖజీపేటకు వెంట పెట్టుకుని వచ్చి తన ఇంటిని పరిశీలించగా ఇంటిలో ఉన్న బీరువను దొంగలు పగలగొట్టి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారం, రూ.40 వేల నగదు దొంగలు చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌చార్జి ఎస్ఐ చంద్రశేఖర్, ఏఎస్ఐ హరిప్రసాద్ క్లూస్‌టీంతో ఖజీపేటకు వెళ్లి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ హరిప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

• యువకుడిపై పోక్సో కేసు నమోదు



కౌతాళం, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో గురువారం సాయంత్రం ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేశాడు. బాలిక ఇంటి దగ్గర ఆడుకుంటుండగా బిస్కట్లు, చాక్లెట్లు ఇస్తానని ఆశచూపి రంగస్వామి అనే యువకుడు తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లి వెతికారు. ఈ సమ యంలో బాలిక యువకుడి ఇంట్లో నుంచి ఏడుస్తూ బయటకు వచ్చింది. తల్లి అడగ్గా బాలిక జరిగిన విషయాన్ని చెప్పింది. మంత్రాలయం సీఐ రామాంజులు ఘటన జరిగిన గ్రామంలో విచారించారు. బాలికను ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సోమ్లానాయక్ తెలిపారు.

హామీల అమలులో బీజేపీ విఫలం

• సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు గఫూర్

పాములపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ళు గడుస్తున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల హామీలను అమలు చేయలేదని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. గురువారం పాములపాడులో పార్టీ సీనియర్ నాయకుడు రామేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీపీఎం కార్యాలయ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టకుండా ట్రంప్ ఆదేశాల మేరకు కాల్పుల విరమణ చేపట్టారని అన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, నల్లధనాన్ని విదేశాల నుంచి తెచ్చి పేదలకు పంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చడంలో మోదీ విఫలమయ్యారని అన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించివేస్తున్నదని అన్నారు. పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, సీనియర్ నాయకులు, ప్రభాకర రెడ్డి, రాజశేఖర్ మాట్లాడుతూ ఒకప్పుడు మోదీని విమర్శించిన చంద్రబాబు నేడు భజన చేస్తున్నారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, ఏసురత్నం, నాగేంద్రుడు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

● కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో గురువారం భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్తంగా యాగంటి పల్లె కృషి విజ్ఞానకేంద్రం ద్వారా వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. రైతులు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటలను సాగు చేసుకోవాలన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందాలని సూచించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ సూగన్న, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మి, రమణయ్య పాల్గొని ఖరీఫ్ ముందు చేపట్టాలిసిన సన్నద్ధత కార్యక్రమాలపై వివరించారు. ఇందులో భాగంగా భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం ప్రస్తుతం పంటల్లో వేయాలిసిన ఎరువుల మోతాదును వివరించారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగరాజు, ఆత్మ పీడీ రత్నకుమార్, ఏడీఏ రాజశేఖర్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్‌దౌలా, సర్పంచ్ వరలక్ష్మమ్మ, జడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలతో ప్రజలపై భారం

● సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు



మాట్లాడుతున్న సీపీఎం నేత మధు

నంద్యాల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని మోదీ, ముఖ్య మంత్రి చంద్రబాబు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అవకాశవాద రాజకీయాలతో ప్రజలపై ధరల భారం పడుతోందని సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మధు ఆరోపించారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ పాక్, భారత్ మధ్య యుద్ధం ఆగడానికి ప్రధాని మోదీ చేసుకున్న ఒప్పందమేంటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేస్తామన్న మోదీ ఎంత మందిని అంతం చేసారో చెప్పాలని ప్రశ్నించారు. భారత్, పాక్‌ల మధ్య యుద్ధం ట్రంప్ జోక్యంతో ఆగిందన్న ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పాలని మోడీని సూటీగా ప్రశ్నించారు. ప్రజలపై విద్యుత్ భారం మోపేలా జగన్ చేసుకున్న సెకీ ఒప్పందం తరహాలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పయనిస్తున్నారని విమర్శించారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేయడానికే మహానాడును చంద్రబాబు ఓ వేదికగా వాడుకుంటున్నారని ఆరోపించారు. వక్ఫ్ సవరణ చట్టం చేసిన మోదీని చంద్రబాబు, జగన్ ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగరాజు, జిల్లా కమిటీ సభ్యుడు పుల్లా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవోకు సత్కారం



డీఐఈవోను సత్కరిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, మే 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిగా బాధ్యతలు తీసుకున్న శంకర్ నాయక్‌ను గురువారం జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు సత్కరించారు. మిడ్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శంకర్‌నాయక్ ఇంటర్ విద్యాశాఖ కమిషన్ ఉత్తర్వుల మేరకు ఇటీవలే ఎఫ్ఏసీ డీఐఈవోగా బాధ్యతలు స్వీకరిం చారు. జిల్లా ప్రభుత్వ అధ్యాప కుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి దివాకర్, జాయింట్ సెక్రటరీ దర్గావలి, స్టేట్ కౌన్సిలర్ పాపోడుతో పాటు జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు కిశోర్‌కుమార్, నాగమురళీమోహన్, శివరామకృష్ణాచారి సత్కరించారు.

విజయవంతం చేయాలి

నంద్యాల మున్సిపాలిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరం వేదికగా ఈ నెల 31న నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సమితి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఓ ప్రకటన విడుదల చేశారు. సీమ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతిలో పాలకులలో ఏ మాత్రం చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి శంకు స్థాపన చేసిన నిర్మాణాలు ఎందుకు సాగించటం లేదని నిలదీశారు. కార్యాచరణ లోపం కారణంగానే ఇచ్చిన హామీలు ఎక్కడా వేసిన గొంగలి అక్కడే అన్న చందాన ఉన్నాయన్నారు. సీమలో కేవలం రూ.15 వందల కోట్లు నిధులు ఖర్చు చేస్తే 10 లక్షల ఎకరాలలో 10 వేల కోట్ల వ్యవసాయ ఉత్పాదనలు ఖరీఫ్ సీజన్ నాటికి వచ్చే అవకాశం తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్ సమీపంలో గొయ్యి పడినా, డ్యాం భద్రతకు ఇబ్బందులు ఎరువుతున్నా అలగనూరు రిజర్వాయర్, గోరుకల్లు రిజర్వాయర్ కట్టలు కుంగినా పాలకులు పట్టించుకోవడం లేదు. పాలకుల అలసత్వాన్ని ప్రశ్నించటంతో పాటు , కరువు సీమను అన్నపూర్ణలా మర్చడానికి సీమవాసులు సిద్ధేశ్వరం సభకు ఉవ్వెత్తున తరలిరావాలని బొజ్జా పిలుపునిచ్చారు.

అప్రకటిత కరెంట్ కోతలు

● అవస్థలు పడుతున్న ప్రజలు
● పాణ్యం మండలంలో విద్యుత్ సరఫరాలో కొరవడిన పర్యవేక్షణ

పాణ్యం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో చిన్న పరిశ్రమలు, గృహ వినియోగదారులు, వ్యాపార సంస్థలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మండలంలో 47, 838 మంది జనాభా ఉండగా దాదాపు 19 వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి, గృహ కనెక్షన్‌లు 14 వేలు, వ్యాపార కనెక్షన్‌లు 11 వందలు, పరిశ్రమలకు 60, తాగునీరు, ప్రభుత్వ, దేవాదాయ తదితర కనెక్షలు 500 వరకు ఉండగా వ్యవసాయ కనెక్షన్‌లు 3300 ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు 1537 ఉన్నాయి. పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 4400 లగృహాలు ఉండగా 15 వేల జనాబా ఉంది. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కోతలతో ప్రభుత్వ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతున్నట్లు ఆయా కార్యాలయాల సిబ్బంది చెబుతున్నారు. చిన్న పరిశ్రమలైన జిరాక్స్, కూల్‌డ్రింక్స్, వెల్డింగ్, పిండిమిషన్, జ్యూస్, హోటళ్లు, వడ్రంగి, రైస్ మిల్లులు, పాలిష్ బండల ఫ్యాక్టరీలు, కంకర మిషన్‌లు, పెట్రోల్ బంకులకు విద్యుత్ అంతరాయం సమస్యగా మారింది. విద్యుత్ కోతలు పరిశ్రమలపై తీవ్రప్రభావం చూపడంతో వినియోగదారులు విద్యుత్ శాఖపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిర్వహణ నిమిత్తం వారంలో ఒకరోజు విద్యుత్ కోత అధికారికంగా ప్రకటించినా మళ్లీసమస్య మొదటి వస్తోందని వాపోతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

విద్యుత్ సరఫరాలో సరైన పర్యవేక్షణ కొరవడడంతో ఈ పరిస్థితి వచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏబీ స్విచ్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో ఒక ప్రాంతంలో విద్యుత్ సమస్య తలెత్తితే గ్రామం మొత్తం చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మెయింటెనెన్స్ సమయంలో ప్రధాన సమస్యలను గుర్తించడంలో విద్యుత్ సిబ్బంది విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో థర్డ్ పార్టీని ఏర్పాటు చేసి ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేపడతామనే అధికారులు హామీలు హామీలుగానే మారాయి.

33 కేవీ విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం

నంద్యాల నుంచి పాణ్యానికి ప్రధానంగా విద్యుత్ అందించే 33 కేవీ విద్యుత్ సరఫరాలో తరచూ మరమ్మతులు తలెత్తడంతో మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని అధికారులు పేర్కొంటు న్నారు. రైల్వే మార్గం నిర్మాణంతో విద్యుత్ సరఫరా తీగలు తెగిపోతుండ డంతో ప్రతిసారి మరమ్మతులు చేపట్టాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. సరఫరాలో అంతరాయం ఏర్పడే సమయంలో ప్రత్యామ్నాయం పనులు చేపట్టాలని, శాశ్వత మరమ్మతులు చేపట్టి నాణ్యమైన విద్యుత్ అందించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



కౌలూరు వద్ద మరమ్మతులను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ప్రేక్షకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



నంద్యాలలో సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో విశ్వనాథ్



నందికొట్కూరులో థియేటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

నంద్యాల నూనెపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని సినిమా థియేటర్లను ఆర్డీవో విశ్వనాథ్, నంద్యాల అర్బన్ తహసీల్దార్ ప్రియదర్శిని గురువారం తనిఖీ చేశారు. పట్టణంలోని పలు థియేటర్లను వారు తనిఖీ చేశారు. థియేటర్లలోని వసతులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. థియేటర్లలోని క్యాంటీన్లలో అమ్మే తినుబండారాలను పరిశీలించి వాటి నాణ్యతను గుర్తించేందుకు అధికారులు స్వయంగా తిన్నారు. థియేటర్ల భవనాలను, టాయ్‌లెట్స్‌ను, పరిసరాలను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా థియేటర్ల నిర్వహణ ఉండాలన్నారు. ఆర్అండ్‌బీ నుంచి బిల్డింగ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఫైర్ రెన్యూవల్, ఎన్‌వోసీ, సినిమా అథారిటీ నుంచి లైసెన్స్‌లు, రెన్యూవల్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. క్యాంటీన్లలో ఎమ్మార్పీకే తినుబండారాలు, శీతల పానీయాలను విక్రయించాలని సూచించారు.

నందికొట్కూరు: సినిమా థియేటర్లలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు ఆయా థియేటర్ల యజమానులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని శ్రీరామ, శ్రీకృష్ణ, శాంతి థియేటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. థియేటర్లకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అగ్నిప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన నిబంధనలు ఉన్నాయా? లేదా? అని తహసీల్దార్ పరిశీలించారు. క్యాంటీన్లను, బాత్రూంలను, టికెట్లు రేట్లను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని థియేటర్ల యజమానులను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

నందికొట్కూరు, మే 29(ఆంధ్రజ్యోతి): నాసిరకం విత్తనాలను సరఫరా చేస్తున్న కంపెనీలపై ఉక్కుపాదం మోపాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని వ్యవసాయశాఖ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయం ముందు రైతులకు నాణ్యతతో కూడి విత్తనాలను సబ్సిడీ కింద అందజేయాలంటూ సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, అఖిల భారత కిసాన్ మహాసభ, ఎంసీపీ(యూ)ఐ అఖిల భారత సమాఖ్య అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. నాయకులు వెంకటేశ్వర్లు, లాజరస్ మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్ ముందుగానే ఈ సంవత్సరం మొదలవుతుందని రైతులు మొక్క జొన్న, పత్తి, మినుము, కంది, ఉల్లి, మిరప, వరి తదితర పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కల్తీ విత్తనాలను తయారు చేస్తున్న కంపెనీ యజమానులపైన ఉక్కుపాదం మోపాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ద్వారా రైతు లకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అగ్రి కల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ ఏవో కలిమున్నిస్సాకు వినతిపత్రం సమర్పిం చారు. ఎన్‌సీపీఐయూ జిల్లా నాయకులు మద్రిస్వామి, మహిళా సంఘం నాయకులు ఎస్‌బీబీ లక్ష్మీదేవి, ముత్తుజాబి, రైతు నాయకులు నరసింహులు, సోమప్ప, బాషా పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలను సక్రమంగా నిర్వహించాలి

ఆత్మకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను సక్రమంగా నిర్వహించాలని ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మకూరు మండలంలోని ఆయా రేషన్ దుకాణాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతి రేషన్ డీలరు 1 నుంచి 15వ తేది వరకు నిర్దేశించిన సమయాల్లో దుకాణాలను తెరవాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ ఉన్నారు.

ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని కళాజాత ప్రతినిధి జంగం శంభు ప్రసాద్ సూచించారు. గురువారం రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్, గౌడ్‌సెంటర్ ఏరియాల్లో ఎయిడ్స్ నిర్మూలనపై ఆటపాటలతో కూడిన నాటకం ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెరిబా సిబ్బంది రాజు, లక్ష్మీనరసమ్మ, మార్తమ్మ, కుమారీ, అరుణ, హబీబుల్లా ఉన్నారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు సంబంధించిన భూముల రీసర్వేలను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ ఉమారాణి వీఆర్వో రామసుబ్బయ్య, సర్వేయర్లను ఆదేశించారు. గురువారం ఆమె కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగులో నిర్వహిస్తున్న రీసర్వేను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయానికి వెళ్లి భూ రికార్డులను తహసీల్దార్ తనిఖీ చేశారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి పూజలు

కొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద గుమ్మడాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు రెండో రోజు గురువారం నిర్వహించారు. స్వామికి ఉదయం 9 గంటలకు ప్రాతఃకాల పూజలు, దీక్ష, రుద్ర నవగ్రహ, గణపతి పూజా హోమాలు నిర్వహించి గ్రామోత్సవం మహా మంగళహారతి పూజలు చేసి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శుక్రవారం మూడో రోజులు స్వామికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జూపాడుబంగ్లా, మే 29(ఆంధ్రజ్యోతి): మండం ప్రజలకు యోగాపై అవగాహన కల్పించి జూన్ 21 తేదీ వరకు జరిగే యోగా కార్యక్రమాల్లో వారిని భాగస్వాములు చేసేవిధంగా అధికారులు పాటుపడాలని ఎంపీడీవో గోపీకృష్ణ సూచించారు. యోగాంధ్రలో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణంలో యోగాంధ్రపై ఎంపీడీవో శిక్షణ ఇచ్చారు. వివిధ శాఖల అధికా రులు, పంచా యతీ కార్య దర్శులు, వీఆర్వోలు, సచివా లయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ స్వర్ణోత్సవాలు



కలశాలకు పూజలు నిర్వహించిన వేదపండితులు

నంద్యాల కల్చరల్, మే 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండరామాలయంలో కలశ దాతలకు మహా సంకల్పం స్వర్ణోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. ఉదయం శాంతిపాఠము, గురువందనం, మండప పూజలు, సహస్ర ఘట స్థాపన, హోమాలు, మూలమంత్ర హవనాలు, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలు విద్యాశంకర భారతి మహాస్వామి శిష్య బృందంచే నిర్వహించారు. సాయంత్రం విద్యాశంకర భారతి మహాస్వామి వారిని బస్టాండు దగ్గర ఆంజనేయస్వామి గుడి నుంచి సంజీవనగర్ రామాలయం వరకు స్వామి వారిని శోభాయాత్ర ద్వారా ఆలయంలోకి భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం స్వామివారి అనుగ్రహ భాషణం కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు భగవత్ సేవాసమాజ్ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారధికృష్ణ, మధు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఆరుద్ర నక్షత్ర పూజలు



స్వామి, అమ్మవార్లకు ఆరుద్ర నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

నంద్యాల కల్చరల్ (శ్రీశైలం), మే 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పుణ్యక్షేత్రంలో శ్రీశైల మల్లన్న జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురష్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఆలయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వేకువజామున మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా స్వర్ణరథోత్సవం దగ్గర పలు కళా బృందాల కోలాటం, తప్పెట, బిందు మొదలైన కళారూపాలు కూడా ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయస్వామి కి విశేష పూజలు నిర్వహించారు. ప్రధానర్చకులు శివప్రసాదస్వామి, అర్చకస్వాములు, వేదపండితులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



కోలాట నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మహానాడుకు తెలుగు తమ్ముళ్లు



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్



కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి ఫరూక్



ఎన్టీఆర్ అభిమానులకు భోజనం వడ్డిస్తున్న ఫిరోజ్, తులసిరెడ్డి



మహానాడులో కార్యకర్తలను పలకరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

నంద్యాల రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): గురువారం గోస్పాడు మండలం దీబగుంట్ల మెట్ట వద్ద మహానాడుకు తరలి వెళ్తున్న వాహనాలను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఫిరోజ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జీవిత చరిత్ర అజరామరం అని అన్నారు. అయ్యలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు భైరెడ్డి శంకరమ్మ ఆధ్వర్యంలో సుమారు 300 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు, ఎస్సార్బీసీ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ అనంత రామసుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ షేక్ హుస్సేన్ బాషా, టీడీపీ నాయకురాలు కత్తి శ్రావణి,శేఖర్ రెడ్డి, మల్లేశ్వర రెడ్డి, బొమ్మరెడ్డి, నాగఅంజి ఉన్నారు.

నంద్యాల కల్చరల్: టీడీపీ శ్రీశైలం మండలం ప్రధాన కార్యదర్శి నాగేళ్ల సురేష్ ఆధ్వర్యంలో మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలం నుంచి 6 బస్సులు, 15 కార్లలో 600 మంది కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు.

పాములపాడు: మహానాడుకు పాములపాడు మండలం నుంచి గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. వేంపెంట గ్రామం నుంచి లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో వెళ్లారు.

ఆత్మకూరు: కడప వేదికగా నిర్వహించిన మహానాడు బహిరంగ సభకు గురువారం ఉదయం టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు.శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి నేతృత్వంలో సుమారు 80 బస్సులతో పాటు, వందకు పైగా కార్లలో దాదాపు 5 వేల మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే ప్రత్యేక భోజన వసతి, వసతి సదుపాయాలను కల్పించారు.

బండిఆత్మకూరు: మండలం నుంచి మహానాడుకు తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి నేతృత్వంలో మండలంలోని 20 గ్రామాల నుంచి తెలుగు తమ్ముళ్ళు మహానాడు బహిరంగ సభకు భారీగా తరలివెళ్లారు.

గోస్పాడు: టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కడపకు వెళ్లారు. మండలం నుంచి 25బస్సుల్లో, వంద కార్లలో, 150 ప్రైవేట్ వాహనాల్లో కార్యకర్తలు, నాయకులు బయల్దేరి వెళ్లారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల నుంచి కడపలో జరుగుతున్న మహానాడుకు టీడీపీ కార్యకర్తలు భారీ స్థాయిలో తరలివెళ్లారు. మంచాలకట్ట గ్రామంలో మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గని గ్రామంలో మురళీమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్, బూజనూరు గ్రామంలో వంట రామచంద్రారెడ్డి, దుర్వేసి గ్రామంలో కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నేడు కల్యాణ మండపానికి భూమి పూజ

బనగానపల్లె, మే 29(ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయం సమీపంలో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి శుక్రవారం భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి చైర్మన్ పీవీ.కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి హాజరు అవుతారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు. భూమిపూజ అనంతరం నందవరం గొల్లపేటలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి బీసీ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

చాగలమర్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ అన్నారు. గురు వారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో గల 500మంది రైతుల పొలాల్లో 516 మట్టినమూనా శాంపిల్స్‌ను సేకరించినట్లు తెలిపారు. 960 మట్టినమూనా శాంపిల్స్ తీయాల్సి ఉండగా 516 శాంపిల్స్ తీశామన్నారు. ఇప్పటివరకు 55శాతం సేకరణ పూర్తయిందన్నారు. ఏఈవో మంజుల, వీహెచ్‌ఏలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

చాగలమర్రి, మే 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తల్లిదండ్రులను కోరారు. గురువారం వారు మాట్లాడుతూ మండలంలో 650 మంది పిల్లలు డ్రాపౌట్స్‌గా ఉన్నారని, వారందరిని తిరిగి బడిలో చేర్పించేందుకు ఎండ్రోల్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఆర్పీలు, ఐఈఆర్టీలు, కస్తూర్బా సిబ్బంది కలిసి ఇంటింటి సర్వే చేస్తున్నారన్నారు. పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ సర్వే చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

1 నుంచి చౌక దుకాణాల్లో రేషన్ పంపిణీ

చాగలమర్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను జూన్ 1వ తేదీ నుంచి చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల కొలతలు, తూకాలు సరిగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. రేషన్ సరుకులు ప్రతినెల 1 నుంచి 15వ తేదీ వరకు సక్రమంగా పంపిణీ చేయాలని, కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగులో తాగునీటి కొళాయి



మురికి కూపంగా ఉన్న కొళాయి వద్ద నీళ్లు పట్టుకుంటున్న గిరిజనులు

చాగలమర్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓజీ తండా గ్రామంలో గిరిజనులకు తాగునీరు అందించే కొళాయి మురికి కూపంలో ఉంది. ఆ మురికి నీటిలోకి వెళ్లి నీటిని పట్టుకోవాల్సి వస్తోంది. మురికి నీటిలోనే పైపులైన్ ఉంది. విద్యుత్ ఉన్నప్పుడే బోరు వద్ద నీరు పట్టుకోవాల్సి వస్తోంది. మినీ ట్యాంకులు, ఓవర్‌హెడ్ ట్యాంకులేక ఇబ్బంది పడుతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీరందేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

పకడ్బందీగా భూ రీసర్వే



మూడురాళ్లపల్లెలో భూరీసర్వే చేస్తున్న సర్వేయర్లు, వీఆర్వోలు

చాగలమర్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న భూరీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని సర్వేయర్లు, వీఆర్వోలకు తహసీల్దార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 7 టీమ్‌లతో చింతలచెరువు, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో భూరీసర్వే పనులు చేస్తున్నామన్నారు. రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి రైతుల సమక్షంలో రోవర్ ద్వారా భూములను కొలతలు తీస్తున్నామని తెలిపారు. రైతులు తప్పనిసరిగా భూరీసర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మద్దిలేటి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు

చాగలమర్రి, మే 29 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సాయినాథ మందిరంలో గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయిభక్తులు జల, క్షీరాభిషేకాలు, విశేష పూజలు చేశారు. మహాన్యాస రుద్రాభిషేకం, సాయివ్రతం, ప్రత్యేక హారతులు చేశారు. సాయి పల్లకితో ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తక్కువ జీతాలతో నెట్టుకొస్తున్నాం



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

డోన్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో గత 25ఏళ్ల నుంచి తక్కువ జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని ఇంజనీరింగ్ కార్మిక విభాగం కార్మిక సంఘం నాయకులు గౌస్ పీరా అన్నారు. డోన్ మున్సిపల్ శాఖలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీవో.36 ప్రకారం వేతనాలు పెంచి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కూడా అందక అన్యాయానికి గురవుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కార్మికులు ఉన్నారు.

వైద్య సిబ్బందికి సహకరించాలి

కొలిమిగుండ్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వైద్య సిబ్బందికి సహకరించి పరీక్షలు చేయించుకోవాలని డా. హరిచరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో నలుగురు క్యాన్సర్ రోగం అనుమానితులను గుర్తించినట్లు వెల్లడించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ(క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రాం) సర్వే కొనసాగుతున్నట్లు తెలిపారు. క్యాన్సర్ రోగులను గుర్తించి, జిల్లా వైద్యశాలకు రెఫర్ చేస్తామన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు



శిరివెళ్లలో నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌శర్మ

శిరివెళ్ల, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ తెలిపారు. శిరివెళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో నీటి నాణ్యతను పరిశీలించే ప్రక్రియను ఆయన గురువారం తనిఖీ చేశారు. పలు చోట్ల నుంచి నీటి నమునాలను సేకరించి నాణ్యతను పరిశీలించామన్నారు. పంచాయతీ కార్యదర్శి అశ్విన్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

● జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి ● యోగా శిక్షణ తరగతుల పరిశీలన



ఉయ్యాలవాడలో యోగా చేస్తున్న అధికారులు



బేతంచర్లలో యోగాసనాలు చేయిస్తున్న గ్రంథాలయ అధికారి



బనగానపల్లెలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి

బనగానపల్లె మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పట్టణంలోని సచివాలయ పంచాయతీ సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అభివృద్ధి పనులను రివ్యూ చేశారు. యోగా శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఉయ్యాలవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో మూడోరోజు యోగా శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం లోని 11 సచివాలయాల నుంచి వంద మందికి యోగాపై శిక్షణ ఇస్తున్నామ న్నారు. వీరు గ్రామాల్లో శిక్షణ అందిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి వెంకటేశ్వర్‌రావు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది ఉన్నారు.



చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో యోగాసనాలు చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు

యోగాతో మానసికోల్లాసం

బేతంచెర్ల: ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా భావించి యోగా చేయడంతో మానసికోల్లాసం సాధ్యమవుతుందని గ్రంథాలయ అధికారి మధుశేఖర్ అన్నారు. గురువారం బేతంచెర్ల శాఖ గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, యోగా తరగతులు, ధ్యానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మధుశేఖర్, టీచర్ కృష్ణప్రియ, 27 మంది విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు

చాగలమర్రి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకై యోగాసనాలు చేయిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల ఉద్యోగులచే యోగాసనాలు వేయించారు. జూన్ 21న జరిగే జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

●టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, మే 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయ ఆవరణంలో పలువురు యువకులకు, ఔత్సాహిక క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి ప్రతిభ చూపాలన్నారు. క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. జాతీయ క్రీడల్లో రాణించాలని ఆమె కోరారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుదని ఆమె తెలిపారు.



క్రికెట్ బ్యాట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

ఘనంగా ఆంజనేయ, నవగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆళ్లగడ్డ, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకండ్ల గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, గణపతి, శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి నవగ్రహ దేవతా కలశ స్థాపన ప్రతిష్ఠా కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తి పుణ్య వాచకం, ప్రతిష్ఠోత్సవాలు కొనసాగాయి. కమిటీ సభ్యులు కోట సంజీవరాయుడు, కంచర్ల బాల గురువయ్య, కాలువ బాలనరసయ్య, నెట్ల పద్మనాభం, జయరామిరెడ్డి, నరసింహుడు, బాలనరసయ్య, లక్ష్మిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ: దేవాలయ కలశ స్థాపనలో కమిటీ సభ్యులు



కొలిమిగుండ్ల: పూజల్లో పాల్గొన్న గ్రామపెద్దలు

నూతన రామాలయం..

కొలిమిగుండ్ల: మండలంలోని ఎస్.చెన్నంపల్లెలో నూతన రామాలయం ప్రతిష్ఠ వేడుకలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామపెద్దల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య ఉదయం గంగపూజ, గోపూజ, గణపతి పూజ, సాయంత్రం అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, దీక్షా హోమం తదితర పూజలు నిర్వహించారు. నాయకులు రమణారెడ్డి, న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, తిరుపతయ్య, మనోహర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

వంతెనపై నుంచి పడి వ్యక్తి మృతి

సంజామల, మే 29(ఆంధ్రజ్యోతి): పాలేరువాగు వద్ద ఏర్పాటైన రామ్‌కో బ్రిడ్జిపై నుంచి కిందపడి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్.ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన రాంబాబు(40) వంతెన వద్ద పైనుంచి కిందపడి గాయాలపాలై స్పృహతప్పాడు. వైద్యచికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యంకోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి బంధువులకు సమాచారమివ్వగా 20రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చాడని, మతిస్థిమితం లేదని బంధువులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రుద్రవరంలో వర్షం

రుద్రవరం, మే 29(ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో గురువారం వర్షం కురిసింది. వీధుల వెంట వర్షం నీరు ప్రవహించింది. ఎక్కడ చూసినా వర్షం నీరు వీధుల్లో నిల్వ చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మురికికాల్వల పనులు పూరి చేస్తే రహదారులపై వర్షం నీరు నిల్వ ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.



ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ సాయిచరణ్, ఆర్డీవో

గాలి మరల ఏర్పాటుకు భూముల సర్వే

● జాయింట్ కలెక్టర్ సాయి చరణ్

బేతంచెర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈక్రోరన్ కంపెనీ గాలిమరలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూములను లీజుకు ఇచ్చేందుకు జాయింట్ కలెక్టర్ సాయి చరణ్, ఆర్డీవో నరసింహులు భూములను గురువారం పరిశీలించారు. మండలంలోని గుటూపల్లి, ముద్దవరం, ఆర్ఎస్ రంగాపురం, ఎం.పెండేకల్, బేతంచెర్ల, కొలుములపల్లె, గ్రామాల్లో ప్రభుత్వ భూములను లీజుకు ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని గాలి మరల కంపెనీ ప్రభుత్వాన్ని కోరింది. సదురు భూములను జేసీ, ఆర్డీవో పరిశీలించారు. అనంతరం కనుమకింద కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న బిల్వ స్వర్గం గుహలను వారు సందర్శించారు. వారి వెంట బేతంచెర్ల తహసీల్దార్ ప్రకాష్‌బాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమంత్ కుమార్ రెడ్డి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉమామహేశ్వరుడి సన్నిధిలో శ్రీశైలం ఈవో



ఉమామహేశ్వరస్వామిని దర్శించుకున్న శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు

బనగానపల్లె, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామిని శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. నందీశ్వరున్ని దర్శించుకొని ఉమామహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శ్రీనివాసరావు దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

భవనాలు పటిష్టంగా నిర్మించాలి

● మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



జ్యోతిరావు పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

బేతంచెర్ల, మే29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం నిర్మిస్తున్న భవనాలను పటిష్టంగా నిర్మించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం బేతంచెర్ల-కర్నూలు రహదారిలోని సమీపంలో ఉన్న ప్రభుత్వ నూతన విద్యాసంస్థల భవనాలను, గోరుమాను కొండ సమీపంలోని ఉన్న ప్రభుత్వ ఐటీఐ భవనాన్ని, ఎంఐఎస్‌పీ నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. జ్యోతిరావు పూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను కూడా పరిశీలించారు. నూతన భవనంలో ఏర్పాటు చేసిన పైకప్పు గాలికిఊడి కింద పడుతుండటంతో వాటి మరమ్మతులను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. ఈ భవనాలను ఆయన పరిశీలించి మరమ్మతులు చేయకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన భవనాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఇది ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించుకోవాలని ప్రిన్సిపాల్ దేవేంద్రకుమార్‌కు బుగ్గన సూచించారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడద్ది, నాయకులు ముర్తుజావలి, కాజాహుశేన్, గూని నాగరాజు మునీశ్వరరెడ్డి, మద్దిలేటి స్వామి, దేవస్థానం మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఎద్దులన్న, కార్యకర్తలు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : ఎంపీడీవో



సచివాలయంలో తనిఖీలు చేస్తున్న ఎంపీడీవో

రుద్రవరం, మే 29 (ఆంధ్రజ్యోతి): విధుల్లో సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం తగదని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని చిత్తరేణిపల్లె గ్రామంలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు పూర్తిస్థాయిలో వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు., రికార్డులు సక్రమంగా ఉంచాలని సూచించారు. సమయపాలన తప్పక పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పాము లేటి, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి 'లైఫ్' చేయూత

బేతంచెర్ల, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నంద్యాలకు చెందిన మురారి అనే 70 ఏళ్ల వృద్ధుడు భిక్షాటన చేసుకుంటూ కాలు జారి కింద పడి లేవలేని స్థితిలో ఉండిపోయాడు. ఆ వృద్ధుడికి లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. లైఫ్ యువనేత్ర సభ్యులు విజయ్, షేక్షావలి, అక్బర్, సుధాకర్, పవన్, రంగారెడ్డి వృద్ధుడిని చేరదీశారు. మరుసటి రోజు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధుడిని బంధువులకు అప్పగించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యువనేత్ర సభ్యులు చందు, రామకృష్ణ, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడులో తెలుగు తమ్ముళ్లు

ప్రత్యేక వాహనాల్లో కడపకు టీడీపీ శ్రేణులు



మహానాడు సభలో టీడీపీ కార్యకర్తలతో ఆర్అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



డోన్ నుంచి ...







బేతంచెర్ల, ఉయ్యాలవాడ, ప్యాపిలి నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



చంద్రబాబుతో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



కడప దర్గాలో ఎమ్మెల్యే గౌరు, కోట్ల సుజాతమ్మ



సీఎం చంద్రబాబుతో ధర్మవరం సుబ్బారెడ్డి

మహానాడుకు నంద్యాల జిల్లాలోని బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్ నియోజకవర్గాల్లో ఆయా మండలాల నుంచి గురువారం తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. కడపకు డోన్ నుంచి తరలివెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి భోజన ఏర్పాట్లను చేశారు. డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సీఎం చంద్రబాబు నాయుడును కలిశారు. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కడపలోని మహానాడు సంబరాల్లో పాల్గొన్నారు. మహానాడు సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ కడపలో ఉన్న ప్రసిద్ధి చెందిన అమీన్ పీర్ దర్గాను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దర్శించుకున్నారు. ఫతేహాలు, ప్రత్యేక దువాలు చేశారు. కడపలోని దేవుని గడప వేంకటేశ్వర స్వామి ఆలయంలో సైతం వారు ప్రత్యేక పూజలు చేశారు. మహానాడుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి పిలుపు మేరకు తరలివెళ్లారు. బనగానపల్లె నియోజకర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మహానాడు బహిరంగ సభకు వచ్చిన టీడీపీ క్యాకర్తలు, నాయకుల కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ పాయింట్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్